క్లుప్తంగా

చంద్రశేఖరస్వామికి అభిషేకాలు


ప్రత్యేక అలంకరణలో చంద్రేడు చంద్రశేఖరస్వామి

రంగంపేట: చంద్రేడులో కొలువై యున్న కాత్యాయనీ సమేత చంద్రశేఖర స్వామి వారికి గురువారం మాసశివరాత్రి సందర్భంగా ఆలయ అర్చకుడు మైలవరపు కృష్ణశర్మ ఆధ్వర్యంలో అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ప్రభుత్వ పాఠశాలల్లో క్రమశిక్షణతో కూడిన విద్య

బిక్కవోలు: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్య అందుతుందని కొంకుదురు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయకుమారి అన్నారు. గురువారం మండలంలోని కొంకుదురు గ్రామంలో ఆమె తన సహోపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలతో వెళ్లి తల్లిదండ్రుల్ని కలిసి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల్ని చేర్పించాలని కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పుస్తకాలు, షూ, బెల్ట్, యూనిఫాం ఉచితంగా అందిస్తుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు.

చిత్రలేఖనంతో సృజనాత్మక శక్తి పెంపొందుతుంది


రంగంపేట గ్రంథాలయంలో చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

రంగంపేట: చిత్రలేఖనంతో విద్యార్థుల్లో సృజనాత్మక శక్తి పెంపొందుతుందని గ్రంథాలయాధికారి ఎస్.రామకోటేశ్వరరావు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన తరగతుల్లో గురువారం తెలుగు భాష ప్రాముఖ్యతను మరియు పంచతంత్ర నీతి కథలను విద్యార్థులకు బోధించారు. అనంతరం విద్యార్థులకు చిత్రలేఖనంపై పోటీలు నిర్వహించారు. కె.దుర్గాప్రసాద్ మేథ్స్‌పై, మేడిశెట్టి శ్రీనివాస్ జనరల్ నాలెడ్జిపై శిక్షణనిచ్చారు. విద్యార్థులు గ్రంథాలయాల్లో ఉన్న మహనీయుల జీవిత చరిత్ర పుస్తకాలను చదివి వారిని స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

రాజానగరం: మండలంలో ఖాళీగా ఉన్న ఐదు వలంటీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఎంపీడీఓ బి.రామారావు తెలిపారు. జి.యర్రంపాలెం, కానవరం, లాలాచెరువు హెచ్‌బీ కాలనీ, సీతారామపురాల్లో పోస్టులను జనరల్, సంపత్‌నగరంలో పోస్టును ఎస్సీ (జనరల్)కి కేటాయించారన్నారు. మే ఒకటి నాటికి 18 నుండి 35 ఏళ్ల వయసు, కనీసం 10వ తరగతి ఉత్తీర్ణులైన వారు అర్హులన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో ఈనెల 22లోగా పంపించాలన్నారు.

చిన్నారులకు తులాభారం


సాయిబాబా సన్నిధిలో తులాభారం

రాజానగరం: స్థానిక షిరిడీ సాయిబాబా ఆలయంలో గురువారం కానవరం, నరేంద్రపురం గ్రామాలకు చెందిన నలుగురు చిన్నారులకు పటిక బెల్లంతో తులాభారం వేశారు. ఆయా పిల్లల తల్లిదండ్రులు, బంధుమిత్రులతో కలిసి వచ్చి బాబాకు మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్న హారతి అనంతరం నిర్వహించిన అన్నసమారాధనలో అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

రాజానగరం: స్థానిక 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఆపరేషన్) నక్కపల్లి శామ్యూల్ తెలిపారు. రాజానగరం, తూర్పుగానుగూడెం, పల్లకడియం, రామస్వామిపేటలకు సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు.

సీతానగరం మండలంలో..

సీతానగరం: మిర్తిపాడు విద్యుత్ సబ్ స్టేషన్‌లో వార్షిక మరమ్మతులు నేపథ్యంలో సబ్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో శుక్రవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు విద్యుత్ నిలిపివేస్తామని ఏఈ చంద్రమోహన్ తెలిపారు. ఉండేశ్వరపురం, మిర్తిపాడు, బొబ్బిల్లంక, ములకల్లంక, కాటవరం, మునికూడలి, రాజంపేట, వెదుళ్లపల్లి, ఇనుగంటివారిపేట, ముగ్గళ్ల గ్రామాలకు, కోరుకొండ మండలం మధురపూడి అగ్రికల్చర్ సర్వీసులకు ఉదయం 7 నుంచి మధ్యాహ్న 11 గంటల వరకు విద్యుత్ నిలిపివేస్తామన్నారు.

ఎండల వేళ.. కొండెక్కిన ఫలాలు

- సామాన్యుడికి అందనంత ఎత్తుల్లో ధరలు
- జ్యూస్ సెంటర్లలో వినియోగం పెరగడమే కారణమంటున్న వ్యాపారులు


అనపర్తిలోని పండ్ల దుకాణం

అనపర్తి: భానుడు నడినెత్తిన నిప్పులు కురిపిస్తున్నాడు. వడగాల్పులు, ఉక్కబోతకు ప్రజలు అల్లాడుతున్నారు. ఉష్ణోగ్రతలు తారస్థాయికి చేరుకుంటున్న నేపథ్యంలో నిస్సత్తువ ఆవరించకుండా పోషక విలువలున్న తాజా పండ్లు తినడం మంచిదని వైద్యులు సూచిస్తున్నారు. కాని మార్కెట్‌లో ఆపిల్, దానిమ్మ, పైనాపిల్, కమలా, ద్రాక్ష, బొప్పాయి, అరటిపండు.. పండేదైనా సరే సామాన్యులకు అందనంత ఎత్తుకు ఎక్కి కూర్చున్నాయి. మండుతున్న ఎండలకు తగ్గట్టే మార్కెట్‌లో పండ్ల ధరలు సైతం సెగలు పుట్టిస్తున్నాయి. ఏ రకమైన పండ్లు కొనాలన్నా వందల్లో రేటు పలుకుతుండడంతో కొనుగోలుదారులకు షాక్ తప్పటం లేదు.

పెరిగిన వినియోగం

వ్యక్తిగత ఆరోగ్యం కోసం, పూజా కార్యక్రమాలకు, బంధువుల ఇంటికి, పరామర్శలకు వెళ్ళినపుడు పండ్లు కొనుగోలు చేస్తుంటారు. పోషక విలువలు ఎక్కువగా వున్న తాజా పండ్ల తీసుకోవడం వల్ల ఆరోగ్యం సమతుల్యంగా ఉంటుందని వైద్యులు పదే పదే సూచిస్తున్నారు. పైగా కరోనా తరువాత పండ్ల వినియోగం పెరిగింది. కాని వేసవిని సాకుగా చూపుతూ డిమాండ్‌కు అనుగుణంగా వ్యాపారులు రేట్లు అమాంతంగా పెంచేస్తున్నారని కొనుగోలుదారులు గగ్గోలు పెడుతున్నారు. అనపర్తి మండలంలోని అనపర్తి, కుతుకులూరు, బిక్కవోలు మండలంలోని బిక్కవోలు, బలభద్రపురం, తొస్సిపూడి, పెదపూడి మండలంలోని జి.మామిడాడ, పెదపూడి, సంపర, రంగంపేట మండలంలోని కోటపాడు, పెదరాయవరం, రంగంపేట తదితర గ్రామాల్లో ప్రధాన రహదారుల్లో ఏర్పాటు చేసుకున్న దుకాణాల్లో అనేకమంది పండ్ల వ్యాపారం సాగిస్తున్నారు.

మార్కెట్‌లో మంట

మార్కెట్‌లో దేశ, విదేశీ రకాల పండ్లు అందుబాటులో ఉన్నా వాటి ధరలు మాత్రం ఆకాశంలో ఉంటున్నాయి. ప్రస్తుతం మార్కెట్‌లో పరిమాణాన్ని బట్టి డజను యాపిల్ రూ.300 నుంచి 350, దానిమ్మ రూ.350 నుంచి 400, కమలా రూ.200, చక్కెరకేళి అరటిపళ్లు రూ.100, నల్ల ద్రాక్ష కేజీ రూ.120, పుచ్చకాయ కేజీ రూ. 35, బొప్పాయి కేజీ రూ.50, డ్రాగన్ ఫ్రూట్ ఒక్కోటి రూ.100లకు విక్రయాలు సాగిస్తున్నారు. దీంతో పండ్ల ధరలు అందుబాటులో లేక వినియోగదారులు పెదవి విరుస్తున్నారు. ముఖ్యంగా జ్యూస్ సెంటర్ల ద్వారా పండ్ల వినియోగం అధికంగా పెరగటంతో వాటి ధరలకు రెక్కలు వచ్చినట్లు పండ్ల వ్యాపారులు చెబుతున్నారు.

ఖర్చులు ఎక్కువవడం వల్లే ధరలు పెరిగాయి



పండ్లు కొనుగోలు చేసేవారి సంఖ్య పెరిగింది. వేసవి కావటంతో డిమాండ్‌కు అనుగుణంగా ధరలు పెరిగాయి. ఖర్చులు విపరీతంగా పెరగడంతో దానికి అనుగుణంగానే గిట్టుబాటు ధరకు అమ్మకాలు జరుపుతున్నాం.

– వీవీ కృష్ణమూర్తి, పండ్ల వ్యాపారి, అనపర్తి

సామాన్యులకు అందుబాటులో లేవు



ప్రస్తుతం పండ్ల ధరలు సామాన్యులకు అందుబాటులో లేవు. ఆఖరికి వేసవిలో దొరికే పుచ్చకాయ, బొప్పాయి ధరలు సైతం పెరిగిపోయాయి. వేసవిలో ఫ్రూట్ జ్యూస్‌లకు డిమాండ్ ఉండడంతో పండ్ల రేట్లు పెరుగుతున్నాయి.

– ఎం.సురేష్, అనపర్తి

మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా సత్యనారాయణ


జక్కంపూడి రాజాకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సత్యనారాయణ

మధురపూడి: కోరుకొండ మండలం మధురపూడికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు, సచివాలయం కమిటీ కన్వీనర్ ఇండుగమెల్లి సత్యనారాయణ తూర్పుగోదావరి జిల్లా మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయన గురువారం రాజమహేంద్రవరంలో ఎమ్మెల్యే జక్కంపూడి రాజాను కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే మధురపూడిలోని సత్యనారాయణ నివాసం అభిమానుల సందడి నెలకొంది. ఆయనను పలు దళిత సంఘాల నాయకులు సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ మండల కో కన్వీనర్ గణేశుల పోసి, నాయకులు బత్తిన త్రిమూర్తులు, మద్దాల చంటిబాబు, పైడిమళ్ల ధనరాజ్ పాల్గొన్నారు.

గడప గడపకూ సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం


గంద్రేడులో స్థానిక మహిళకు ప్రభుత్వ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- గంద్రేడులో గడప గడపకూ మన ప్రభుత్వం

పెదపూడి: గడప గడపకూ సంక్షేమ పథకాలు అందించడమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. గురువారం గంద్రేడులో ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి కుటుంబాన్ని తన కుటుంబంగానే భావించి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. అమ్మ ఒడి, సామాజిక పింఛన్, రైతు భరోసా, విద్యా దీవెన, వైఎస్సార్ ఆసరా, పంట నష్ట పరిహారం తదితర పథకాల ద్వారా ప్రజలు ఎంత మేర లబ్ధి పొందారో వివరించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన గ్రామ వలంటీర్లు, సచివాలయ వ్యవస్థలతో ప్రభుత్వ పథకాలు ఇంటి ముంగిటకే అందుతున్నాయన్నారు. వలంటీర్లు సైనికుల్లా పనిచేస్తూ సేవలందిస్తున్నారని కొనియాడారు. ప్రజాసంకల్ప పాదయాత్రలో జగనన్న ప్రజల కష్ట సుఖాలను తెలుసుకుని పేదలందరికీ చిత్తశుద్ధితో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. అందుకే ప్రజలు జగన్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతా తులసి, జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాయల వెంకటలక్ష్మి, సర్పంచ్ కుడిపూడి మాధవీలత, సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు కోసూరి వాసు, పార్టీ మండల కన్వీనర్ గుత్తుల వెంకటరమణ, పార్లమెంటు జిల్లా బీసీ సెల్, అనపర్తి నియోజకవర్గం బీసీ సెల్ కన్వీనర్లు కేతా శ్రీను, వాసంశెట్టి మాధవ తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులందరికీ సాగు హక్కు పత్రాలు


సమావేశంలో మాట్లాడుతున్న ఏఓ మణిదీప్

పెదపూడి: అర్హులైన కౌలు రైతులందరికీ పంట సాగుదారు హక్కు పత్రాలు మంజూరు చేస్తామని మండల వ్యవసాయశాఖాధికారి టీవీఆర్ మణిదీప్ అన్నారు. ఏపీత్రయం, కైకవోలు గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాల వద్ద రెవెన్యూ, వ్యవసాయ శాఖ సంయుక్తంగా పంట సాగుదారు హక్కు పత్రం అవగాహన సదస్సులు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మణిదీప్ మాట్లాడుతూ ఈ నెల 27 వరకూ సదస్సులు నిర్వహిస్తామని చెప్పారు. మండలంలోని అన్ని గ్రామాల్లో కౌలు రైతులంతా గ్రామ రెవెన్యూ అధికారి వద్దకు వెళ్లి కౌలు కార్డులు నమోదు చేయించుకోవాలన్నారు. పంట సాగు హక్కు పత్రం ద్వారా సాగుదారునికి ఈ–పంట నమోదు, పంట నష్ట పరిహారం, ఉచిత పంటల బీమా, సున్నా వడ్డీ రాయితీ, కనీస మద్దతు ధర, ధాన్యం కొనుగోలు వంటి పథకాలన్నీ వర్తిస్తాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ అడబాల అనురాధ, ఎంపీటీసీ సభ్యురాలు పెండెం జ్ఞాన ప్రసూన, ఏఎంసీ డైరెక్టర్ గుండా ఈశ్వరరావు, వీఆర్వో గొల్లపల్లి వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు జాబ్ కార్డులు


గ్రామసభలో మాట్లాడుతున్న ఏపీవో నాగశేషవేణి

సీతానగరం: ఉపాధి హామీ పథకం పనులకు వచ్చే మండలంలోని ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు జాబ్ కార్డులు అందిస్తామని ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో కె.నాగ శేషవేణి తెలిపారు. రఘుదేవపురం సచివాలయ ఆవరణలో గురువారం ఉపాధి హామీ పథకం కూలీలకు సర్పంచ్ ఇండుగుమిల్లి చంద్రలీల అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీవో మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు జాబ్ కార్డులతోపాటు వంద రోజుల పని కల్పిస్తున్నామన్నారు. గ్రామంలోని వికలాంగులకు పనులు కల్పిస్తామన్నారు. ఉద్యానవన పంటలకు, మునగ ప్లాంటేషన్ నన్న, చిన్నకారు రైతులకు మొక్కలు అందిస్తామన్నారు. కూలీలకు సకాలంలో వేతనాలు వారి ఖాతాల్లో జమవుతున్నాయన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు గెద్దాడ త్రిమూర్తులు, పట్టపగలు ప్రసాద్, ఎన్ఆర్ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ నారే సుబ్బారావు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న 2019-20 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

రాజమహేంద్రవరం రూరల్: తొర్రేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2019–20 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు గురువారం పాఠశాల ఆవరణలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన స్నేహితులందరూ ఆనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ సందడి చేశారు. ఈ కార్యక్రమం నిర్వహించిన బొల్లిన సతీష్, సీహెచ్ రవికిషోర్, సుంకవల్లి శ్రీధర్, మారెడ్డి రాజశేఖర్, కొండా వేణును స్నేహితులందరూ అభినందించారు. జయ, ఉమ, శిరీష, ప్రభ, ఆదిలక్ష్మి, ప్రకాష్, రాజేంద్ర, రాంబాబు, మధు పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ఉత్తమ ర్యాంకు సాధిద్దాం


సమీక్ష నిర్వహిస్తున్న కమిషనర్ దినేష్ కుమార్

రాజమహేంద్రవరం సిటీ: స్వచ్ఛ సర్వేక్షణ్‌లో 30 లోపు ర్యాంకు సాధించే లక్ష్యంగా నగరంలో పారిశుధ్యం నిర్వహించాలని కమిషనర్ దినేష్ కుమార్ పిలుపునిచ్చారు. గురువారం నగర పాలకసంస్థ కార్యాలయంలో శానిటేషన్ కార్యదర్శులు, ఇన్‌స్పెక్టర్లు, సూపర్ వైజర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గార్బేజ్ ఫ్రీ సిటీ అసెస్మెంటులో త్రీస్టార్ రేటింగ్ సాధించాలన్నారు. దీనికి సంబంధించిన విధి విధానాలపై శిక్షణ ఇస్తామన్నారు. నగరంలో తిరుగుతున్న పశువులను ఎప్పటికప్పుడు గోశాలకు తరలించాలని, వాటి యజమానులకు గట్టి హెచ్చరికలు చేయాలని ఆదేశించారు. బల్క్‌గా గార్బేజ్ ఉత్పత్తి చేసే వారితో కంపోస్టింగు చేయించాలన్నారు.


లైఫ్ కనెక్ట్ చారిటబుల్ ట్రస్టు ప్రారంభం


మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న ట్రస్టు వ్యవస్థాపకుడు నాగేంద్ర

రాజమహేంద్రవరం సిటీ: లైఫ్ కనెక్ట్ చారిటబుల్ ట్రస్టు ద్వారా ప్రతి నెలా సేవా కార్యక్రమాలు నిర్వహించి, పేదలకు చేతనైనంత మేరకు సహాయ, సహకారాలు అందిస్తామని ట్రస్టు వ్యవస్థాపకుడు పప్పుల నాగేంద్ర అన్నారు. గురువారం స్థానిక అన్నపూర్ణమ్మపేటలోని ఆయన నివాసం వద్ద పేద మహిళలకు చీరలు పంపిణీ చేసి, ట్రస్టు కార్యకలాపాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా సుమారు 500 మంది మహిళలకు చీరలు అందజేశారు. నాగేంద్ర మాట్లాడుతూ లైఫ్ కనెక్ట్ ద్వారా ప్రతి ఒక్కరి జీవితాలతో కనెక్ట్ కావాలనే ఆకాంక్షతో ఈ చారిటబుల్ ట్రస్టును ప్రారంభించామన్నారు. ప్రతి పేద కుటుంబానికి తమ ద్వారా సాయం అందించేందుకు ఒక కార్డు ఇస్తామన్నారు. తన కుటుంబం, మిత్రులు చారిటబుల్ ట్రస్ట్ కార్యకలాపాల్లో సహకారాలు అందిస్తున్నారన్నారు. నాగేంద్ర మిత్ర బృందం ప్రకాష్, చిన్న, గాంధీ, విష్ణు, సత్య తదితరులు పాల్గొన్నారు.

బాలుడి వైద్యానికి రూ.14 లక్షలు

- మంజూరు చేసిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు
- చొరవ చూపిన ఎంపీ, ఎమ్మెల్యేలు


బాలుడి తండ్రికి ఆరోగ్యశ్రీ, పీఎం రిలీఫ్ ఫండ్ పత్రాలు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

గోకవరం: అరుదైన వ్యాధితో బాధ పడుతున్న బాలుడి వైద్యానికి వైఎస్సార్ ఆరోగ్యశ్రీ, పీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.14 లక్షలు మంజూరయ్యాయి. దీనికి స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకుడు సుంకర వీరబాబు తదితరులు ఈ వివరాలు తెలిపారు. గోకవరం గ్రామానికి చెందిన రెండున్నరేళ్ల బాలుడు అక్షయ్‌రామ్ బోన్‌మేరో సంబంధిత వ్యాధితో బాధ పడుతున్నాడు. అతడికి చికిత్స చేయించే స్తోమత తల్లిదండ్రులకు లేదు. దీంతో వారు ఈ విషయాన్ని వైఎస్సార్ సీపీ నాయకుల ద్వారా ఎమ్మెల్యే, ఎంపీ దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం కింద రూ.11 లక్షలు మంజూరయ్యేలా కృషి చేశారు. దీని ద్వారా మన రాష్ట్రంతో పాటు తెలంగాణ, తమిళనాడు, బెంగళూరులోని సుమారు 22 ఆస్పత్రుల్లో ఎక్కడైనా వైద్యం చేయించుకోవచ్చని వీరబాబు చెప్పారు. అలాగే కాకినాడ ఎంపీ వంగా గీత సహకారంతో ప్రధానమంత్రి రిలీఫ్ ఫండ్ నుంచి రూ.3 లక్షలు మంజూరయ్యాయి. బాధిత బాలుడు అక్షయ్‌రామ్‌ను హైదరాబాద్‌లోని బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రికి ఎంపీపీ సుంకర శ్రీవల్లి ఆధ్వర్యంలో స్వయంగా తీసుకువెళ్తామని వీరబాబు తెలిపారు. అనంతరం ఆరోగ్యశ్రీ, పీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు పత్రాలను బాలుడి తండ్రి సతీష్‌కు అందజేశారు. తన కుమారుడి వైద్యానికి సహకరించిన ఎంపీ, ఎమ్మెల్యే, కలెక్టర్, ఎంపీపీ, స్థానిక నాయకులకు సతీష్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి వరసాల ప్రసాద్, ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ కర్రి సూరారెడ్డి, వైస్ ఎంపీపీ మడికి మైనర్‌బాబు, గుబ్బాలమ్మ ఆలయ కమిటీ చైర్మన్ సరాలశెట్టి నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ సంఘాల గుర్తింపును పునరుద్ధరించాలి


సమావేశంలో పాల్గొన్న ఉద్యోగుల సంఘం నాయకులు

రాజమహేంద్రవరం సిటీ: తపాలా శాఖ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటాలు చేస్తున్న జాతీయ తపాలా ఉద్యోగుల సమాఖ్య, అఖిల భారత తపాలా ఉద్యోగుల సంఘం గుర్తింపు రద్దు ఆర్డరును వెంటనే వెనక్కి తీసుకోవాలని ప్రజా సంఘాల సమన్వయ కమిటీ, కేంద్ర కార్మిక, ఉద్యోగ సంఘాలు, భారత తపాలా ఉద్యోగుల సంఘం డిమాండ్ చేశాయి. స్థానిక ప్రధాన తపాలా కార్యాలయం వద్ద గురువారం మధ్యతరగతి, ప్రజా సంఘాల సమన్వయ కమిటీ, కేంద్ర కార్మిక, ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. పలు యూనియన్ల నాయకులు మాట్లాడుతూ కేంద్రం తెచ్చిన నూతన రైతు చట్టాలకు వ్యతిరేకంగా జరిగిన రైతు ఉద్యమానికి ఆర్థిక సహాయం చేశారన్న కారణంగా రెండు యూనియన్ల గుర్తింపు రద్దు చేయడం అప్రజాస్వామికమన్నారు. స్వాతంత్రానికి ముందే తపాలా ఉద్యోగ సంఘాలు హక్కుల కోసం బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా ఉద్యమాలు చేశాయన్నారు. 80 శాతం ఉద్యోగులు సభ్యులుగా ఉన్న ఈ రెండు యూనియన్ల గుర్తింపు రద్దు చేయటం అన్యాయమన్నారు.

మజ్జిగ పంపిణీ


మజ్జిగ పంపిణీ చేస్తున్న రుడా చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి

రాజమహేంద్రవరం సిటీ: ఎంఎస్ఆర్ ఫాలోవర్స్ ఆధ్వర్యంలో బీసీ యువసేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బూడిద శరత్ కుమార్, వైఎస్సార్ సీపీ నాయకుడు కాటం సంజయ్ కాంత్ (షాన్) నేతృత్వంలో స్థానిక నందం గనిరాజు జంక్షన్‌లో గురువారం మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమానికి రుడా చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ ఎండ తీవ్రత ఎక్కువగా ఉందని, ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని సూచించారు. వైఎస్సార్ సీపీ నాయకులు గుదే రఘు నరేష్, మేడపోయిన సునీల్, మైనార్టీ నాయకులు ఎస్‌కే షరీఫ్, ఎస్‌కే బాషా, ఎంఎస్ఆర్ ఫాలోవర్స్ సభ్యులు పాల్గొన్నారు.

వలంటీర్ల అవార్డు పంపిణీ షెడ్యూల్ విడుదల

బిక్కవోలు: మండలంలోని వలంటీర్లకు ఇచ్చే అవార్డు పంపిణీకి షెడ్యూల్ విడుదలైనట్లు ఎంపీడీవో జేఏ ఝాన్సీ తెలిపారు. ఈ నెల 20వ తేదీన బిక్కవోలు, 22న బలభద్రపురం, ఊలపల్లి, 23న పందలపాక, తొస్సిపూడి, 24న కొమరిపాలెం, 25న కొంకుదురు, 26న కాపవరం, 27న రంగాపురం, ఇలపల్లి, 29న ఆరికరేవుల, మెళ్లూరు గ్రామాల్లోని సచివాలయాల్లో ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి సమక్షంలో అవార్డుల పంపిణీ జరుగుతుందన్నారు. మండల వ్యాప్తంగా సేవ వజ్ర ఒక్కరికి, సేవా రత్న ఐదుగురికి, సేవా మిత్ర 404 మందికి అవార్డులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

సీతానగరం: మండలంలోని బొబ్బిల్లంకకు చెందిన కాకర్ల త్రిమూర్తులు (40) కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున 2.15 గంటలకు మృతి చెందాడని హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణరావు గురువారం తెలిపారు. హైదరాబాద్ రెస్టారెంట్ నడుపుతున్న త్రిమూర్తులు ఈనెల 5న బొబ్బిల్లంక వచ్చాడు. మార్గంమధ్యలో విజయవాడ వద్ద గడ్డిమందు కొనుగోలు చేసి ఇంటికి తీసుకువచ్చాడు. ఫోన్ యాఫ్ ద్వారా తీసుకున్న అప్పు చెల్లించడానికి స్నేహితుల వద్ద అప్పులు చేశాడు. వాటిని చెల్లించలేని పరిస్థితి ఏర్పడంతో ఈ నెల 6న గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. ముందుగా రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి, మెరుగైన వైద్యసేవలకు కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు.

ఐరిస్ ద్వారా నిత్యావసర సరకులు

సీతానగరం: వేలి ముద్రలు పడని కార్డుదారులకు ఐరిస్ ద్వారా నిత్యావసర సరకులు అందిస్తామని తహసీల్దార్ ఎస్.సత్యనారాయణ రాజు తెలిపారు. ఆయన గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కుష్ఠు బాధితులు, వృద్ధులు, రోజువారీ కూలీలు తదితర వేలిముద్రలు పడని వారి సౌకర్యార్థం ఐరిష్ రీడర్లను ఎండీయూ ఆపరేటర్లకు సరఫరా చేయడం జరుగుతుందన్నారు.

ఆదివాసీ సదస్సును జయప్రదం చేయాలి


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

సీతానగరం: విశాఖపట్నంలో ఈనెల 21న జరిగే అఖిల భారతి ఆదివాసీ సదస్సును జయప్రదం చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పల్ల వెంకట నాయుడు, జిల్లా నాయకులు పాలెపు రామారావు దొర, సాకిరి భాస్కర్, డివిజన్ నాయకులు జగన్నాథం నాగన్న కోరారు. ఈ మేరకు గురువారం చీపురపల్లిలో సభ నిర్వహించి, పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి వెంకట నాయుడు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసీలను అభివృద్ధి పేరుతో అడవి నుంచి గెంటివేసి, అటవీ సంపదను కార్పొరేట్ కంపెనీలకు దారాదత్తం చేసేందుకు కుట్రలు పన్నుతున్నాయని ఆరోపించారు.

బాల కార్మిక వ్యవస్థను నిర్మూలిద్దాం


ర్యాలీని ప్రారంభిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి ప్రత్యూష కుమారి

కంబాలచెరువు: జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై కార్మిక శాఖ, ఇతర శాఖల సహకారంతో గురువారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. డీఎల్ఎస్ఏ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి మాట్లాడుతూ ఆరు నుంచి 14 ఏళ్ల పిల్లలకు ఉచిత నిర్బంధ విద్య పొందడం వారికి రాజ్యాంగం కల్పించిన హక్కు అన్నారు. పిల్లలను కార్మికులుగా మార్చడం నేరమని, అలా చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. పిల్లల భద్రత దృష్ట్యా సంబంధిత అధికారులు, వ్యవస్థలు మరింత పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో భాగంగా కొన్ని బృందాలను ఏర్పాటు చేసి పట్టణంలోని పలు ప్రాంతాలలో తనిఖీ చేసేందుకు ఆదేశాలు జారీ చేశారు. ఈ తనిఖీలకు సంబంధించిన నివేదికను జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు అందించాలన్నారు.